సమస్యల జాతర

మొత్తం సీసీ కెమెరాలు	పని చేస్తున్నవి
12	4
ఉండాల్సిన సెక్యూరిటీ సిబ్బంది 9	ఉన్నవారు 4
ఉండాల్సిన హౌస్‌కీపింగ్ సిబ్బంది 9	ఉన్నవారు 5



సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించే శిల్పారామం (జాతర)లో అడుగడుగునా సమస్యలు దర్శనమిస్తున్నాయి. నిత్యం సందర్శకుల తాకిడి ఉండే ప్రదేశాల్లోనూ సీసీ కెమెరాలు పని చేయడం లేదు. సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ సిబ్బంది కొరత వేధిస్తోంది. కళాఖండాలు చాలావరకు శిథిలమయ్యాయి.



కళావిహీనంగా మారిన 'కోడిగుడ్డులో నుంచి పిల్ల బయటకు వస్తున్న కళాఖండం'

- కళ తప్పుతున్న 'శిల్పారామం'
- పని చేయని సీసీ కెమెరాలు
- సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్ సిబ్బంది కొరత
- కూలిన ప్రహరీ
- అల్లూరి స్మారక మ్యూజియం.. మూలకు



జాతరలో బర్డ్స్ కేవ్ వద్ద పనిచేయని సీసీ కెమెరా

మధురవాడ: మధురవాడ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న అత్యంత సువిశాలమైన శిల్పకళా ఉద్యానవనం శిల్పారామం జాతర. ప్రారంభించిన కొత్తలో చక్కని కళాఖండాలతో, పచ్చదనంతో కళకళలాడుతుండేది. కాలక్రమేణా నిర్వహణ లోపంతో ఒక్కొక్కటిగా అన్నీ మూలకు చేరాయి. ఇక్కడికి ఉదయం వ్యాయామం కోసం వచ్చే సీనియర్ సిటిజన్స్‌తో పాటు స్విమ్మింగ్ పూల్, ఇతర ఆటల కోసం వచ్చేవారు నిత్యం వందలాది మంది ఉంటారు. కనీస సౌకర్యాలు, రక్షణ లేకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు.

అస్తవ్యస్తంగా పరిసరాలు



దెబ్బతిన్న ప్రహరీకి అడ్డుగా పెట్టిన డొంకలు, రేకులు

ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఏపీ శిల్పారామాల సొసైటీ శిల్పారామం నిర్వహణ చూస్తోంది. అయితే, ఇక్కడ వివిధ రకాల కార్యకలాపాలు కోసం కాంట్రాక్టులు దక్కించుకున్న ప్రైవేటు వ్యక్తులు కూడా తమకు అనుగుణంగా పార్కు పరిసరాలు అస్తవ్యస్తంగా తయారు చేసేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి శిల్పారామానికి మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకురావాలని కళాభిమానులు, సందర్శకులు కోరుతున్నారు.

ప్రధాన సమస్యలివీ..

- ఇక్కడ ప్రధాన గేటు మొదలు, ఫంక్షన్ హాలు, ఔట్‌గేట్, ల్యాన్, బర్డ్స్ కేవ్, అల్లూరి సీతారామరాజు స్మారక మ్యూజియం తదితర చోట్ల 12 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇందులో కేవలం 4 కూడా పూర్తిగా పని చేస్తున్న దాఖలాలు లేవు.
- సువిశాలమైన ఉద్యానవనానికి రక్షణ కల్పించాల్సిన సెక్యూరిటీ సిబ్బంది 9మంది ఉండాల్సి ఉండగా కేవలం నలుగురే ఉన్నారు.
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు లాన్, ఇతర కళాఖండాలు వంటివి శుభ్రపరచడానికి, పచ్చదనం, మొక్కల నిర్వహణ పనులు చేపట్టాల్సి హౌస్‌కీపింగ్ సిబ్బంది సగం మందే ఉన్నారు.
- సాయిప్రియ లే అవుట్ రోడ్డుతో పాటు ఇతర ప్రాంతాలలో నాలుగైదు చోట్ల ప్రహరీ కూలిపోయింది. దీనికి ముళ్ల డొంకలు, రేకులు అడ్డంగా పెట్టారు. దీంతో ఊర కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. సందర్శకులు భయభ్రాంతులకు గురవుతున్నారు.
- సీసీ కెమెరాలు పనిచేయక పోవడం, సిబ్బంది కొరత, ప్రహరీ సరిగ్గా లేకపోవడంతో ఆకతాయిలు ప్రవేశిస్తున్నారు. వారి చేష్టలతో కుటుంబాలతో వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు.
- స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మ్యూజియంలో చాలా బొమ్మలు ఆనవాళ్లు లేకుండా పోయాయి.
- ఇక్కడ గుడ్డులో నుంచి కోడిపిల్ల బయటకు వచ్చేట్లుగా తయారు చేసిన కళాఖండంతో పాటు ఇతర బొమ్మలు చాలా శిథిలమైపోయాయి.
- లాన్‌లో పచ్చదనం కరువైంది. చాలా షెడ్‌లు పాడయ్యాయి.
- జాతరకే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న కోడిపుంజు కళాఖండంలో కింది భాగం బీటలు వారి, దెబ్బతినే స్థితిలో ఉంది.



ఆకతాయిలకు అడ్డాగా మారుతున్న యోగశాల పరిసర ప్రదేశాలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఇక్కడ సీసీ కెమెరాలు 8 పనిచేయడం లేదు. సెక్యూరిటీ సిబ్బంది, హౌస్ కీపింగ్ సిబ్బంది కొరత ఉంది. ప్రహరీ వాల్ దెబ్బతిన్న చోట నిర్మాణం.. తదితర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. సీసీ కెమెరాల కేబుల్ కట్ అయింది. ఇతర ఇబ్బందులు కూడా సరిచేసి సీసీ కెమెరాలు త్వరలోనే అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడతాం.

–విశ్వనాథరెడ్డి, పరిపాలనాధికారి, శిల్పారామం

జోన్-2లో షాపులకు 'ఉద్యమ్' రిజిస్ట్రేషన్లు

మధురవాడ: జీవీఎంసీ జోన్ 2 పరిధిలో షాపులకు ఉద్యమ్ (యూడీవైఏఎం) రిజిస్ట్రేషన్లు జరుగుతుండడంతో పలువురు దుకాణ యజమానులు బుధవారం జోనల్ కార్యాలయానికి తరలి వచ్చారు. బ్యాంకు రుణాలు, ఇతర ప్రభుత్వ స్వాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పనిసరి అని అధికారులు సూచిస్తున్నారు. ఎంఎస్ఎంఈ తరహాలో ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. ట్రేడ్ లైసెన్స్, ఇతర గుర్తింపు ఉన్నవారికి కూడా ఈ రిజిస్ట్రేషన్లు తప్పనిసరి అని చెప్పడంతో షాపుల యజమానులు తరలి వస్తున్నారు. జోన్ పరిధిలోని 5 నుంచి 13 వార్డుల్లో దుకాణదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు. రిజిస్ట్రేషన్ల కోసం జోనల్ కార్యాలయంలో ఫిబ్రవరి 21, మార్చి 5, 22 తేదీల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.



మధురవాడ జోనల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్న షాపుల యజమానులు

కూటమి పాలనలో పెరిగిన ధరలు

తగరపువలస: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ధరలు పెరుగుతున్నాయంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు, లోకేష్ అధికారం చేపట్టిన తరువాత పోటీపడి ప్రజల నడ్డి విరుస్తున్నారని సీపీఐ భీమిలి ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు విమర్శించారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల భారాన్ని ప్రజలపై రుద్ది మరొక వైపు విద్యుత్ చార్జీలు, స్టాంపు రిజిస్ట్రేషన్ల చార్జీలు పెంచడం సరికాదన్నారు. సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు బాదుడే బాదుడు అంటూ విమర్శలు చేసిన కూటమి నాయకులు ఇప్పుడు చేస్తోందేమిటని ప్రశ్నించారు. మరోపక్క నిత్యావసర సరకుల ధరలు అదుపు చేయలేకపోతున్నారన్నారు. దీంతో ప్రజల జీవనం కష్టంగా మారుతోందన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు, విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజల అభిప్రాయాలతో పాటు అఖిలపక్ష పార్టీల సూచనలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఆదినారాయణ, అల్లం గోవిందరావు, ముత్యాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి రాంబాబు

విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు

6 బృందాలుగా వెళ్లి చదువుల పరిశీలన

మధురవాడ: పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమేనని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.రవి అన్నారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ఇంటికి వెళ్లి పరిశీలించారు. శివశక్తినగర్, కొమ్మాది, మారికవలస, గణేష్‌నగర్, సేవానగర్, సాయిరాం కాలనీ తదితర ప్రాంతాలలో విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులతో కలిసి బుధవారం రాత్రి ఆయన వెళ్లి, పరిశీలించారు. ఉపాధ్యాయులు 6 బృందాలుగా విడిపోయి ఈ విధంగా సమావేశాలు నిర్వహించారు. పరీక్షల్లో బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవడంపై పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించారు. పిల్లల చదువు, ఆరోగ్య పరిరక్షణపై పర్యవేక్షణ ఎలా చేయాలో తెలియజేశారు.



నివాస ప్రాంతాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం రవి

'పది'లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

మధురవాడ: ఉపాధ్యాయులు సరైన శ్రద్ధ తీసుకుని విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించి వారు శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖరరావు అన్నారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో బుధవారం ఆయన మాట్లాడారు. పదో తరగతి ఎంతో కీలకమని, దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి మాట్లాడుతూ విద్యార్థులకు ఆయా సబ్జెక్ట్‌ల బోధన విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వివరించారు.

విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టాలి

కొమ్మాది: పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రతి నిమిషాన్ని ఉపయోగించుకునేలా చూడాలని సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ (ఏపీసీ) జె.చంద్రశేఖరరావు సూచించారు. ఈ సమయం చాలా విలువైందన్నారు. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల ఉత్తీర్ణత కోసం తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టి జవాబులు రాసే సమయంలో చేసే తప్పిదాలను గమనించి, వారికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.భాను తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న చంద్రశేఖరరావు

అదిగో జాగా.. వేసేద్దాం పాగా

తగరపువలస: చిట్టివలస రైతుబజారు నిర్మాణం పూర్తి కావస్తుండటంతో ఆ చుట్టుపక్కల ప్రదేశాలపై కూటమి నాయకుల కళ్లు పడ్డాయి. చిరు వ్యాపారుల నుంచి వేల రూపాయలు దండుకుని దుకాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. దీంతో కూటమి నాయకులకు డబ్బులు ఇచ్చిన వారు తాత్కాలికంగా గ్రంథాలయం రోడ్డులో కర్రలతో స్థలాలను ఆక్రమిస్తున్నారు. ఇప్పటికే తాతా థియేటర్ నుంచి పాత ఆంధ్రాబ్యాంక్ వరకు రహదారి ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే వీలు లేకుండా పోతుంది. దీంతో నిత్యం ఈ మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అంతేకాకుండా ఈ మార్గంలో తోపుడుబండ్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మెకానిక్ దుకాణాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే నిలిపి ఉంచుతున్నారు. ఇప్పుడు రైతుబజారు వస్తుండటంతో రహదారిని ఆనుకుని కొత్తగా దుకాణాలు వెలిస్తే పాత ప్రైవేట్ మార్కెట్ వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగినట్టే. భవిష్యత్తులో రైతుబజారు మార్గం కూడా ఇరుకుగా మారిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని రైతుబజారులో తప్ప రహదారికి ఇరువైపులా కొత్తగా దుకాణాలకు అనుమతించకుండా జీవీఎంసీ, ట్రాఫిక్ విభాగాలు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చిట్టివలస రైతుబజారు మార్గంలో రహదారి పక్కన దుకాణాల కోసం కర్రలతో ఆక్రమణ

మూడు నెలలుగా ముంపులోనే..

గొట్టిపల్లి కళ్లాల అంగన్‌వాడీ కేంద్రం

తగరపువలస: ఆనందపురం మండలం రేగానిగూడెం సెక్టార్ గొట్టిపల్లి కళ్లాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రం ముంపు ముంగిట విలవిలలాడుతోంది. మూడు నెలల క్రితం కురిసిన వర్షాలకు కేంద్రం చుట్టూ చేరిన నీరు లోపలికి కూడా ప్రవేశించింది. ఆ నీరు ఇప్పటికీ ఇంకకుండా అలాగే ఉండిపోయింది. భవనం లోపల నీరు లేకపోయినా ప్రస్తుతం టాయిలెట్, కుళాయి ముంపులోనే ఉన్నాయి. దీంతో చిన్నారులు, సిబ్బంది ఇబ్బంది పడుతూనే ఉన్నారు. చుట్టూ నీరు, తుప్పల కారణంగా విషపురుగులు కేంద్రంలోకి వస్తుండటంతో భయంతో తమ చిన్నారులకు అంగన్‌వాడీకి పంపించాలంటేనే తల్లిదండ్రులు హడలిపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ముందు ప్రదేశాన్ని స్థానిక పాడి రైతులు ఆక్రమించి ప్రమాదకరమైన యంత్రాలు, ఎండు గడ్డి ఉంచారు. అంగన్‌వాడీ సిబ్బంది అభ్యంతరాలను చుట్టుపక్కల వారు పట్టించుకోవడం లేదు. దీంతో తల్లిదండ్రులు మాట్లాడుతూ ఐసీడీఎస్ అధికారులు కలగజేసుకుని చిన్నారులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని కోరుతున్నారు. లేదంటే అంగన్‌వాడీ కేంద్రానికి పంపించబోమని స్పష్టం చేస్తున్నారు.



ముంపులో గొట్టిపల్లి కళ్లాల అంగన్‌వాడీ కేంద్రం

క్లుప్తంగా

విద్యార్థులకు దంత పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని యాక్స్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం దంత వైద్య పరీక్షలు చేశారు. గీతం డెంటల్ ఆస్పత్రి సహకారంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యం వంద మందికి దంత పరీక్షలు చేయించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జీవీ ప్రభాకర్, ప్రిన్సిపాల్ ఎం.పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

'రామాయణ కల్పవృక్షం'పై 8న సాహిత్యగోష్టి

తగరపువలస: విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెంలో ఈ నెల 8న 'శ్రీరామాయణ కల్పవృక్షం' కవితా వైభవంపై తగరపువలసకు చెందిన ప్రముఖ పద్యకవి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బులుసు వెంకటేశ్వర్లు సాహిత్యగోష్టి జరగనుంది. భీష్మ ఏకాదశి సందర్భంగా నిర్వహించనున్న చిట్టిపాప తీర్థ మహోత్సవంలో తానా పురస్కార గ్రహీత అయిన బులుసు వెంకటేశ్వర్లు కవితా వైభవంపై జరగనున్న సాహిత్యగోష్టికి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరు కానున్నారు.

ఫీజుల కోసం వేధింపులు..!

తగరపువలస: జీవీఎంసీ 4వ వార్డు గోవుపేటకు చెందిన ఓ కార్పొరేట్ పాఠశాల ఫీజుల కోసం వేధిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రూ.లక్షలలో ఫీజులు వసూలు చేసే ఈ స్కూల్ యాజమాన్యం మిగిలిన విద్యార్థుల ముందు అవమానాలకు గురి చేస్తోందని విద్యార్థులు ఇళ్ల వద్ద వాపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో స్కూల్ యాజమాన్యాలు మితిమీరిపోతున్నాయని పేర్కొన్నారు. ఫీజులు చెల్లింపునకు గడువు ఇవ్వాలని కోరుతున్నా ససేమిరా అంటూ వేధిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బడ్జెట్‌పై సీఐటీయూ నిరసన



బైపాస్ రోడ్డు వద్ద బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

తగరపువలస: కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ బైపాస్‌రోడ్డు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బడ్జెట్ ప్రతులను ప్రధాన రహదారిపై దహనం చేశారు. జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ప్రధాని మోదీ రాష్ట్రానికి మొండి చేయి చూపించారన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు, లేబర్ కోడ్‌లను కుదించి బిల్లులు పెట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. దీనిని సీఐటీయూ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. నిరసన కార్యక్రమంలో మండల నాయకులు ఎస్.అప్పలనాయుడు, నీలాతి రాము, ముగడ ఈశ్వరరావు, సూర్యరావు, రీసు నరసింగరావు, పల్లా రమణ, కొత్తయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలంకరణకు 'లాంతర్లు'



ఆకట్టుకుంటున్న లాంతర్లు

మధురవాడ: ఒకప్పుడు వెలుగు కోసం కాస్త స్తోమత ఉన్నవారు మాత్రమే వాడే లాంతరు నేడు పూర్తిగా అలంకార వస్తువుగా మారిపోయింది. విలాసవంతమైన భవనాలు, హోటళ్లు, రిసార్ట్‌లలో వీటిని ఉపయోగిస్తున్నారు. మహారాష్ట్ర అమరావతికి చెందిన చేతి వృత్తి వ్యాపారస్తులు మెహబూబ్ తదితర 4కుటుంబాలు ఇక్కడికి వచ్చి ఇలా లాంతర్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇవి అందరినీ విశేషంగా ఆకట్టుకోవడంతో కొనుగోలు చేయడానికి పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. ఒక్కో లాంతరు రూ.70 నుంచి రూ.100 వరకు అమ్ముడవుతోంది. ఇవి కిరోసిన్ లేదా ఆయిల్‌తో పనిచేసే లాంతర్లు. మనకి కిరోసిన్ అందుబాటులో లేకపోయినా అమ్ముడవుతుండడం విశేషం.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేస్తున్న స్పీడ్ బ్రేకర్లు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ ఎస్‌ఐ సీహెచ్. చిరంజీవిరావు ఆధ్వర్యంలో బుధవారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఎర్రమట్టిదిబ్బల సమీపంలోని మార్లిన్ కే రెస్టారెంట్ మలుపు వద్ద వీటిని ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఈ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

10న కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ పదో వార్షికోత్సవాన్ని ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు, 108 కలశాలతో ఆలయ ప్రదక్షిణ, గణపతి పూజ, పుణ్యాహవచనం, 108 కలశాలతో అమ్మవారి ఉత్సవ మూర్తులకు జలాభిషేకం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆ రోజు మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.

భరతుడి త్యాగం మహోన్నతం

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు
- 12వ రోజుకు సంపూర్ణ రామాయణ ప్రవచనాలు



మధురవాడ: ఆదర్శవంతమైన నడవడిక కలిగిన సత్పురుషుడు భరతుడు అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంపూర్ణ శ్రీరామాయణంపై బుధవారం 12వ రోజు ఆయన ప్రవచించారు. అయోధ్యకాండలో దశరథ మహారాజు మరణం, భరతునికి కలిగిన దుస్వప్నములు, భరతుడు అయోధ్య నగరానికి తిరిగి వచ్చి కళాహీనంగా ఉన్న నగరాన్ని చూసి తండ్రి మరణం కైకమ్మ ద్వారా తెలుసుకున్న తర్వాత పడిన పరివేదనను చాగంటి తెలియజేశారు. భరతుని త్యాగం మహోన్నతమని వివరించారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

తగరపువలస: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. చిట్టివలస సీఐటీయూ కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 117 జీవో వలన ప్రాథమిక పాఠశాల వ్యవస్థ చిన్నాభిన్నం అయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆదర్శ పాఠశాలల పేరుతో ప్రాథమిక పాఠశాలలను బలహీనపరచే ప్రయత్నం జరుగుతోందన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ బడులు దూరం చేసే ప్రభుత్వ ప్రయత్నాలను తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పీడీఎఫ్ 17 ఏళ్లుగా చేస్తున్న కృషి, ఐక్య పోరాటాల గురించి వివరించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ఉపాధ్యాయ ఉద్యమ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము, టి.ఆర్. అంబేడ్కర్, దాసరి నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.